RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:48 8-8-2025 శుక్రవారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-


## ఈ-ఆధార్ యాప్

### అభివృద్ధిపై దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం




ఇంటర్నెట్ డెస్క్:ఆగస్టు 7(టుడే విదుర): డిజిటలీకరణ దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఆధార్ సేవలను మొబైల్ ద్వారా అందించేందుకు ఓ కొత్త యాప్ అభివృద్ధిపై కేంద్రం దృష్టిపెట్టినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ-ఆధార్ పేరిట ఈ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తేనున్నారు. దీని ద్వారా పౌరులు తమ పేరు, అడ్రస్, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్ తదితర సాధారణ వివరాలను స్మార్ట్ ఫోన్‌ల ద్వారానే ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవచ్చు. అధార్ వివరాల అప్‌డేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఈ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు తెలుస్తోంది. %ఈ యాప్ అందుబాటులోకి వస్తే ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్‌కు పౌరులు వెళ్లాల్సిన అవసరం చాలా వరకూ తగ్గుతుందని యూఐడీఏఐ వర్గాలు చెబుతున్నాయి. స్మార్ట్ ఫోన్ సాయంతో యూజర్లు రోటిన్ వివరాలను సులువుగా అప్‌డేట్ చేసుకోవచ్చు. యూజర్లకు అత్యంత అనుకూలంగా ఉండేలా యాప్ ఇంటర్‌ఫేస్‌ను డిజైన్ చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే భారీ క్యూలల్లో నిలబడటం, పేపర్‌వర్క్, వివరాల అప్‌డేషన్‌లో అనవసర జాప్యం వంటి చిక్కులన్నీ తొలగిపోతాయి. యాప్ అందుబాటులోకి వచ్చాక యూజర్లు కేవలం తమ బయోమెట్రిక్ వివరాల (ఐరిస్, ఫింగర్ ప్రింట్స్) అప్‌డేషన్ కోసమే ఆధార్ కేంద్రాలను సందర్శించాల్సి ఉంటుంది.


## ఏడాదికి రూ.25 వేలు..
## నేతన్నలకు చంద్రన్న భరోసా..!



అమరావతి,ఆగస్టు 7(టుడే విదుర):చేనేత కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో శుభవార్త చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు చేసిన 11వ జాతీయ చేనేత దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త పథకం గురించి ప్రకటించారు. 'నేతన్న భరోసా' పథకం కింద చేనేత కుటుంబాలకు ఏడాదికి రూ.25 వేలు ఇస్తామని వెల్లడించారు. ఈ నెల నుంచి చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఉచిత విద్యుత్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా 93 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.వ్యవసాయం తర్వాత ఎక్కువమంది ఆధారపడేది చేనేత పరిశ్రమ పైనే అని జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. నైపుణ్యం, సృజనాత్మకత కలయిక అయిన మన చేనేత పరిశ్రమ భారతీయ శక్తికి, సంస్కృతికి, సాంప్రదాయాలకు ప్రతీక అని కొనియాడారు. చిన్నవయసులోనే అనారోగ్యం పాలవుతున్న నేతన్నలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో తొలిసారి నేతన్నలకు 50 ఏళ్లకే పింఛన్ ఇచ్చామని అన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా తెలుగుదేశం పార్టీ చేనేత కార్మికుల కోసం పోరాటం చేసిందని గుర్తుచేశారు.

## గొడ్డలిపోటును.. గుండెపోటుగా నమ్మించారు..

### వైఎస్ సునీత సంచలన వ్యాఖ్యలు




కడప:ఆగస్టు 7(టుడే విదుర): వైఎస్ సునీత మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. (గురువారం) ఆమె జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ వివేకా హత్య కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత కొద్దిరోజులుగా పులివెందులలో జరిగుతున్న ఘటనలు చూస్తుంటే నాన్న(వివేకా) హత్య గుర్తుకు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.నాన్న గొడ్డలిపోటుతో పడిఉంటే.. గుండెపోటు అని చెప్పారని సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను బెదిరించి క్రైమ్ సీన్‌ను తుడిచేశారని ఆరోపించారు. హత్య తరువాత కొందరు వ్యక్తులు లెటర్ తీసుకువచ్చి ఆదినారాయణ రెడ్డి, సతీష్ రెడ్డి, బిటెక్ రవిలు హత్య చేసినట్లుగా తనని సంతకం పెట్టామన్నారని తెలిపారు. తాను ఎంత బలవంతం చేసినా సంతకం పెట్టలేదని స్పష్టం చేశారు.అప్పుడు వైఎస్ అవినాష్ రెడ్డి అనుచరులు పోలీసులను బెదిరించారని ఆరోపించారు. నాన్న(వివేకా)ను టీడీపీ నేతలు చంపారని నమ్మబలికారని తెలిపారు.

## ప్రతి అతిథికి మంగళగిరి వస్త్రం బహుమతి..

### మంత్రి లోకేష్ నూతన సంప్రదాయం



అమరావతి,ఆగస్టు 7(టుడే విదుర): మంగళగిరిలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. యువగళం పాదయాత్రలో చేనేతల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చామని గుర్తుచేశారు. ఇవాళ(గురువారం) మంగళగిరిలో మంత్రి నారా లోకేష్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో లోకేష్ మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉండగానే చేనేతలను సొంత నిధులతో అన్ని విధాలా ఆదుకుంటూ వచ్చామని ఉద్ఘాటించారు మంత్రి నారా లోకేష్.

చేనేతల ఆదాయం 30శాతం పెరిగేలా అన్నివిధాలా చర్యలు తీసుకున్నామని మంత్రి నారా లోకేష్ నొక్కిచెప్పారు. చేనేతలను ఆదుకుంటూనే స్వర్ణకారులకు ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. అతిథులు ఎవరిని కలిసినా మంగళగిరి వస్త్రాన్ని బహుమతిగా ఇచ్చే ఆనవాయితీ పెట్టుకున్నామని చెప్పుకొచ్చారు. ఏపీవ్యాప్తంగా డబుల్ ఇంజిన్ సర్కారు నడుస్తుంటే... మంగళగిరిలో ట్రిపుల్ ఇంజన్ సర్కారు నడుస్తోందని ఉద్ఘాటించారు. ప్రతీ ప్రజాసమస్యను బాధ్యతగా తీసుకుని పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి తీరుతామని తెలిపారు. చేనేతల అభ్యున్నతి కోసం పోరాడిన ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వాన్ని మంత్రి నారా లోకేష్ కోరారు.

## తురకా కిషోర్‌ను

### తక్షణమే విడుదల చేయండి: హైకోర్టు



అమరావతి,ఆగస్టు 7(టుడే విదుర): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్‌ను తక్షణమే విడుదల చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అతడి విడుదలపై కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని వెల్లడించింది. కిషోర్ అరెస్ట్ విషయంలో పోలీసులు చట్ట నిబంధనలు ఉల్లంఘించారని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే మేజిస్ట్రేట్ మైండ్ అప్లై చేయలేదని ప్రాథమికంగా అభిప్రాయపడుతున్నామంటూ హైకోర్టు ధర్మాసనం కాస్తా ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలోనే తురకా కిషోర్ విడుదలకు ఆదేశాలు ఇస్తున్నామని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది.మరోవైపు తురకా కిషోర్‌కు ఇటీవల అన్ని కేసుల్లో బెయిల్ లభించింది. దీంతో గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. అయితే ఆ వెంటనే మరో కేసులో అతడిని రెంటచింతల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కిషోర్‌ను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారంటూ పోలీస్ వాహనం ఎదుట తురకా కిషోర్ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

## వైసీపీకి బిగ్ షాక్.. ఎంపీ అవినాష్ రెడ్డిపై మరో కేసు

కడప, ఆగస్టు 7(టుడే విదుర): : వైసీపీ నేతలు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సతీష్ రెడ్డిలపై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. అవినాష్ రెడ్డి, సతీష్ రెడ్డిలు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి అనుమతి లేకుండా అధిక సంఖ్యలో కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారని ఎంపీడీవోకు కొంతమంది ఫిర్యాదు చేశారు. పులివెందులలో నిన్న జరిగిన ఘర్షణకు సంబంధించి తెలుగుదేశం వైసీపీ శ్రేణులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి. టీడీపీకి చెందిన నలుగురు నేతలతో పాటు మరికొందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వైసీపీకి చెందిన ఇద్దరు నేతలతో పాటు మరికొందరిపై పులివెందుల పోలీసులు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు.

## తిరుపతిలో దళిత యువకుడిపై దాడి..

### వైసీపీ కీలక నేత అనుచరుల అరాచకాలు వెలుగులోకి..



తిరుపతి,ఆగస్టు 7(టుడే విదుర): వైసీపీ కీలక నేత భూమన అభినయ్ అనుచరుల అరాచకాలు తిరుపతిలో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తిరుపతి వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్ రెడ్డి, అతని స్నేహితులు దళిత యువకుడిని చిత్రహింసలకు గురిచేస్తున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. పవన్ కుమార్ అనే యువకుడు తీసుకున్న నగదు ఇవ్వలేదనే కారణంతో కిడ్నాప్ చేసి లాడ్జిలో బంధించి దుడ్డుకర్రలు, ఫైబర్ లాఠీలతో కొడుతూ చిత్రహింసలకు గురిచేశారు అభినయ్ అనుచరులు.పవన్ కుమార్ తండ్రి తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో భూమన అభినయ్, అతని అనుచరులపై ఫిర్యాదు చేశారు. అయితే, ఇంకా కిడ్నాపర్ల చెరలోనే పవన్ కుమార్ ఉన్నారు. బాధిత యువకుడు ఆచూకీ కోసం పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. 45 రోజుల నుంచి తల్లిదండ్రులకు అందుబాటులో లేకుండా పోయాడు బాధిత యువకుడు పవన్ కుమార్. గత రాత్రి పవన్ తండ్రి ఫోన్‌కు చిత్ర హింసల వీడియోలను భూమన అభినయ్, అతని అనుచరులు పంపించారు.డబ్బు కోసం తనను హింసిస్తున్నారని పవన్ కుమార్ తన తండ్రికి చెబుతూ.. బోరున విలపించాడు. (బుధవారం) రాత్రి 11 గంటలకు పోలీసులకు బాధిత యువకుడు పవన్ కుమార్ తండ్రి జయరాజ్ సమాచారం ఇచ్చాడు. అయితే పవన్ కుమార్ కుటుంబం పులిచెర్ల మండలం మెరవపల్లిలో నివాసం ఉంటున్నారు. పోలీసులు తన కుమారుడు ఆచూకీ త్వరగా గుర్తించాలని, తనకు న్యాయం చేయాలని పవన్ కుమార్ తండ్రి జయరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు.తిరుపతి వైసీపీ అరాచక ఘటనపై ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. రౌడీ రాజకీయం చేస్తూ ఉంటే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఎంతటి వారైనా చట్టం ముందు సమానులేనని వార్నింగ్ ఇచ్చారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

# రైట్.. రైట్..!

## 15నుంచి ఏపీలో మహిళలకు ఫ్రీ బస్సు

వెబ్ డెస్క్ :ఆగస్టు 7(టుడే విదుర): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏపీలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఈనెల 15 నుంచి పథకం ప్రారంభించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఈ స్కీమ్?కు ప్రభుత్వం స్త్రీ శక్తి అనే పేరును సర్కార్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 15న ఈ పథకాన్ని ప్రారంభించనుంది.

రాష్టంలో ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లినా మహిళలు, ట్రాన్స్?జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్? రెడ్డి ప్రకటించారు. ఈనెల 15న దీనిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ పథకాన్ని 5 కేటగిరి బస్సుల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో ఈ అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆధార్, ఓటర్, రేషన్‌కార్డుల్ని గుర్తింపు కార్డులుగా పరిగణించనున్నట్టు వివరించారు.

ఆ బస్సుల్లో మాత్రమే ఉచితం..

ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి పథకానికి స్త్రీ శక్తి అని పేరు పెట్టారు. మొత్తం ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. రాష్టంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. మహిళలు ఆధార్, ఓటర్ కార్డ్, రేషన్ కార్డు ఐడిలో ఏదో ఒకటి చూపించాల్సి ఉంటుంది. ఈ ఉచిత ప్రయాణానికి సంబంధించి పల్లె వెలుగు అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్, నగరాల్లో మెట్రో, సిటీ సబర్బన్ సర్వీసులు ఉంటాయి. వీటిలో మాత్రమే ఎక్కడినుంచి ఎక్కడికి అయినా ఉచితంగా ప్రయాణించవచ్చు. అదే సమయంలో ప్రీమియర్ సర్వీసులుగా ఉన్న నాన్ స్టాప్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులు, తిరుమల ఘాట్ రోడ్డులో వెళ్లే బస్సులకు ఉచిత ప్రయాణ పథకం వర్తించదు. పొరపాటున ఈ బస్సుల్లో ఎక్కితే టిక్కెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే మహిళలు ఒకటికి రెండుసార్లు చూసుకుని బస్సులు ఎక్కాల్సి ఉంటుంది.

ఉచిత బస్సుల్లో సైతం టిక్కెట్లు ఇస్తారు

అయితే ఉచిత ప్రయాణ పథకంలో సైతం.. బస్సు ఎక్కిన మహిళలకు టికెట్లు ఇస్తారు. అయితే వాటిని జీరో ఫెర్ గా చూపిస్తారు. టికెట్ ధర జీరో గా చూపిస్తారు. వారు ప్రయాణించే స్టేషన్ల మధ్య టిక్కెట్ ధర ను సైతం అందులో పొందుపరుస్తారు. అలా టికెట్ ధరను ప్రభుత్వ రాయితీ కింద చూపించనున్నారు. మరోవైపు ఉచిత ప్రయాణానికి సంబంధించి ఆర్టీసీ సిబ్బంది కి శిక్షణ కూడా ఇస్తున్నారు. అనవసర వివాదాలు లేకుండా.. మహిళల పట్ల మర్యాదగా వ్యవహరించే విధంగా సిబ్బందికి పలు రకాల సూచనలు ఇస్తోంది ఏపీఎస్ఆర్టీసీ మిగతా రాష్ట్రాల్లో ఈ పథకం అమలు జరుగుతుండగా అనేక రకాల వివాదాలు జరుగుతున్నాయి. అందుకే ముందు జాగ్రత్త చర్యగా శిక్షణ ఇస్తున్నట్లు తెలుస్తోంది.

# కూటమి ప్రభుత్వంలో చేనేతకు చీకటి రోజులు

తాడేపల్లి,ఆగస్టు 7(టుడే విదుర): తాడేపల్లి వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. కేంద్ర పార్టీ కార్యాలయ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సురేంద్రబాబు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా చేనేత రంగానికి వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మేలును వారు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత చేనేత రంగానికి చీకటి రోజులు వచ్చాయని మండిపడ్డారు. చేనేత కార్మికులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సురేంద్ర బాబు మాట్లాడుతూ. "జీఎస్టీ అనేది కేంద్రం పరిధిలోని అంశమే అయినా యువగళం పాదయాత్రలో నారా లోకేష్ చాలా సందర్భాల్లో చేనేతలకు జీఎస్టీ ఎత్తివేస్తామని, లేదంటే రీయింర్స్‌మెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఈ 14 నెలల్లో ఏనాడూ చేనేతల జీఎస్టీ గురించి లోకేష్ మాట్లాడిన పాపాన పోలేదు. జీఎస్టీ కౌన్సిల్‌లోనూ టీడీపీ ప్రస్తావించలేదు. గతేడాది విజయవాడలో నిర్వహించిన చేనేత దినోత్సవం రోజున ఆరోగ్య బీమా కింద తక్షణమే రూ.10 కోట్లు రిలీజ్ చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. వాటికి ఇప్పటికీ మోక్షం లభించలేదు సరికదా ఈ ఏడాది దాన్ని రూ.5 కోట్లకు తగ్గించి మోసం చేస్తున్నాడు. జీఎస్టీ ఎత్తివేయడానికి రీయింబర్స్‌మెంట్ కింద ఏడాదికి రూ.67 కోట్లు ఖర్చవుతుందని అదే రోజు చంద్రబాబు చెప్పారు. చేనేతలకు ఈ 14 నెలల్లో ఒక్క రూపాయి సాయం చేసింది లేదు" అని అన్నారు. ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహన్ రావు మాట్లాడుతూ "ఆప్కో సేల్స్ పెరిగితే సొసైటీలకు పని పెరుగుతుందని భావించి తిరుపతి, కడపలో మూడంతస్తుల సొంత భవనం, గుంటూరు, ఒంగోలు, గన్నవరం ఎయిర్‌పోర్ట్, రేణిగుంట ఎయిర్‌పోర్ట్, తదితర ప్రాంతాల్లో అత్యాధునిక షోరూమ్‌లను వైయస్సార్సీపీ హయాంలోనే ఏర్పాటు చేశాం. గతంలో వైయస్సార్ కూడా సీఎంగా ఉండగా కేంద్రంతో మాట్లాడి 11.3శాతం ఎక్సైజ్ డ్యూటీని ఒక్క రోజులో రద్దు చేయించారు" అని అన్నారు.

# చీమలతో పసందైన విందు





**పిపీలికాలతో షడ్రసోపేత వంటకాలు**

**గుడ్లతో కలిపి పులుసు, పచ్చడి, కూర, వేపుడు**

**మన్యంలో కొనసాగుతున్న పాత అలవాట్లు**

**ఆరోగ్యానికి ఎంతో మేలంటున్న గిరిపుత్రులు**

(సీతంపేట రూరల్ ఆగస్టు 7(టుడే విదుర): చీమల దండును చూస్తే ఆమడ దూరం వెళ్లిపోతారు ఎవరైనా. ఇక చెట్లపై ఆకుల్లో గూడులు కట్టే పుల్లేరు (పుల్ల) చీమల జోలికి అస్సలు పోరు. అవి కుడితే వచ్చే మంట తట్టుకోవడం మామూలు విషయం కాదు. కానీ, అలాంటి పుల్లేరు చీమలను చూస్తే పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలోని గిరిపుత్రులకు నోరూరుతుంది. పిపీలికాలతో చేసిన షడ్రసోపేతమైన వంటకాలు కళ్ల ముందు కదలాడుతూ ఉంటాయి. వెంటనే చెట్లపై ఉన్న ఆ పుల్లేరు చీమల గూడులను లాఘవంగా సేకరిస్తారు. ఇంటికి తీసుకెళ్లి పసందైన వంటకం చేసుకుని విందారగిస్తారు. సాధారణంగా మన్యం ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయలు, ఆహారపు అలవాట్లు, కట్టు బొట్టులాంటివి మైదాన ప్రాంతాల్లో నివసించే ప్రజలకంటే భిన్నంగా ఉంటాయి. ఓ పక్క ఆధునికతకు అలవాటు పడుతూనే, మరోపక్క పురాతన గిరిజన సంప్రదాయాలను అక్కడి ప్రజలు కొనసాగిస్తున్నారు. గిరిజనులు నివసించే ప్రాంతాన్ని బట్టి ఒక్కో రకమైన ఆహారపు అలవాట్లు ఉంటాయి. సీతంపేట మన్యంలో నివసిస్తున్న ఆదివాసీలు చీమలను ఎంతో ఇష్టంగా వండుకుని తినడం వెనుక పలు నమ్మకాలు దాగి ఉన్నాయి.సీతంపేట మన్యం ఆదివాసీలు ఆహార వేటలో భాగంగా అటవీ ప్రాంతంలోని చెట్టు కొమ్మల్లో గూళ్లు కట్టుకున్న పుల్లేరు చీమలను సేకరించి ఆరు రకాల వంటకాలను వండి ఇష్టంగా ఆరగిస్తున్నారు. పుల్లేరు చీమలు, అవిపెట్టే గుడ్లతో పచ్చడి, సూప్, చీమల వేపుడు, కూర, సాంబారు, పప్పు వంటి వంటకాలను వండుతున్నారు. మరి కొందరైతే అడవిలో సేకరించిన పుల్లేరు చీమలను, అవిపెట్టే గుడ్లను బతికుండగానే తినడం కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

# సెల్‌ఫోన్, టైలరింగ్ షాపుల్లో చోరీ



పలాస, ఆగస్టు 7(టుడే విదుర): పోలీసు పహ రా ఉండే కాశీబుగ్గ కేటీ రోడ్డు శ్రీనివాస లాడ్జి జం క్షన్ వద్ద అర్ధరాత్రి దాటిన తరువా త దొంగలు రెచ్చిపోయారు. ఓ సెల్‌ఫోన్ షాపులో తాళాలు విరగ్గొట్టి షాపులో వివిధ వ్యాపారులకు చెల్లించడానికి దాచి ఉంచిన నగదు రూ.1.20 లక్ష లు అపహరించారు. దానికి సమీపంలో ఉన్న ఓ టైలరింగ్ షాపులో ప్రవేశించి అందులో నగదు ఏ దీ లభ్యం కాకపోవడంతో దుస్తులను అపహరించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉ న్నాయి. బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన నిమ్మన షన్ముఖరావు కేటీ రోడ్డులోని బా లాజీ సెల్‌ఫోన్ సర్వీసింగ్ సెం టరు నిర్వహిస్తున్నారు. దీనికి ఆనుకొని ఓ టిఫిన్ షాపును కూ డా వీరే నిర్వహిస్తున్నారు. ఈ క్ర మంలో వేకువజాము యజమాని షన్ముఖరావుతో పాటు ఆయన సోదరుడు యువరాజ్ షాపు వద్దకు వచ్చేసరికి తాళాలు విరగొట్టి షట్టర్ తెరిచి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే క్యాష్ కౌంట రులో నగదు చూడగా మాయం అయినట్టు గుర్తించారు. వెంటనే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ పి.సూర్యనారాయ ణ, క్లూస్‌టీమ్ సభ్యులు ఘటన స్థలానికి వచ్చి ఆ ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి ఆధా రాలు సేకరించారు. అదేవిధంగా పలాసలో నివా సం ఉంటున్న జినగ గోపాల్ కేటీ రోడ్డు గున్నేశ్వర నగర్‌లో స్టైలిస్ట్ టైలరింగ్ షాపు నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో ముసుగువేసుకున్న ఓ అగంతకుడు ప్రవేశించి షాపులో క్యాష్‌బాక్స్‌ను తెరిచాడు. అందులో ఏవీ లభించకపోవడంతో వినియోగదారులకు అందించాల్సి ఉన్న దుస్తులను అపహరించుకుపోయాడు. ఉదయం షాపు తెరి చేందుకు వచ్చిన యజమానికి తాళాలు బద్దలు కొట్టినట్టు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. షాపులో సీసీ కెమెరాలో ఓ దొంగ ఉన్నట్టు గుర్తించారు.



# హమ్మయ్యా అక్క వద్దకు వచ్చేశాను

**ఇంటికి చేరుకున్న వెంకటరావు**

**కన్నీటి పర్యంతమైన తమ్ముడు**

**భావోద్వేగానికి గురైన అక్క**

**రాఖీ పండుగకు తమ్ముడిని నా చెంతకు చేర్చిన దేవుడు**


**వెంకటరావుకు వైద్య పరీక్షలు**

నెలిమర్ల,ఆగస్టు 7(టుడే విదుర):అక్క వద్దకు చేరిన ఆ తమ్ముడు తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. పట్టలేని ఆనందపరవశుడయ్యాడు. ఇంటికి చేరిన తమ్ముడిని చూసిన అక్క రాఖీ పండుగకు తమ్ముడిని ఆ దేవుడే ఇంటికి పంపాడని సంతోష పడింది. సహకారం అందించిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపింది. నెల్లిమర్ల బృందావన కాలనీలో బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో చోటుచేసుకున్న దృశ్యాలివి. తిరుపతి నుంచి కోరుమల్లి వెంకటరావు నెలిమర్ల చేరుకున్నారు. అక్క అరుణాపాథిక్‌ను చూడగానే ఆనందాశ్రువులతో పలకరించాడు. అక్కా తమ్ముళ్లు ఇద్దరూ భావోద్వేగానికి గురై మాటలు రాని ఆనందానుభూతి చెందారు. అనంతరం వెంకటరావును అక్క, బావ ఇంటి లోపలకు తీసుకెళ్లి సపర్యలు చేసి అల్పాహారం అందించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనంలో వెంకటరావును తిరుపతి నుంచి నెలిమర్లకు తరలించారు. వెంకటరావు ఇంటికి చేరుకున్నాక నగర పంచాయతీ కమిషనరు జయరాం, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. వెంకటరావును పరీక్షించి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. నెల్లిమర్ల సీఐ రామకృష్ణతో పాటు ఎస్ఐ గణేష్ వెంకటరావును పరామర్శించి ఆయనకు ధైర్యం చెప్పారు. టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనందకుమార్, నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ పతివాడ రాజేష్, ఉపాధ్యక్షుడు కామేశ్వరి, పార్టీ నాయకులు రాజేశ్, ఆల్తి మల్లిబాబు పరామర్శించారు. వెంకటరావుకు ధైర్యం చెప్పారు.

# సామాన్యులపై ధరాఘాతం

ఆగస్టు 7(టుడే విదుర):గతంలో ఎన్నడూ లేనివిధంగా నిత్యావస సరుకుల ధరలు భారీగా పెరిగిపోవటంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు. కిలో కందిపప్పు రూ.130 నుంచి రూ.150కు చేరింది. ఎండు మిర్చి రూ.180 నుంచి రూ.220కి చేరింది. చింతపండు రూ.110 నుంచి రూ.140కి చేరింది. శనగ పప్పు రూ.90 నుంచి రూ.100కు చేరింది. పెసలు రూ.115 నుంచి రూ.130, మినుములు రూ.110 నుంచి రూ.125, వేరుశనగ నూనె రూ.140 నుంచి రూ.160, ధనియాలు రూ.105 నుంచి రూ.120, నువ్వులు రూ.160 నుంచి రూ.170, పామాయిల్ రూ.80 నుంచి రూ.95, సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.120 నుంచి రూ.150 చొప్పన ధరలు పెరిగాయి. మరోవైపు కూరగాయలు కొండెక్కి కూర్చున్నాయి. వరదలు, వర్షాలు కారణంగా డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవటం మరోవైపు శ్రావణ మాసం కావటంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. కేజీ టమోటా కేజీ రూ.50కి చేరింది. గత నెలలో రూ.30ల చొప్పన విక్రయాలు జరిగాయి. వంకాయలు కేజీ రూ.40 నుంచి రూ.60కి చేరాయి. బెండకాయలు, కాకర, బీరకాయలు, గోరు చిక్కుళ్లు, దోస తదితర కూరగాయలు గత నెలలో 30 నుంచి రూ.35 మధ్యలో ఉండగా తాజాగా రూ.50 నుంచి రూ.60 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. తీగ చిక్కుళ్లు గత నెలలో కేజీ రూ.80 కాగా ప్రస్తుతం రూ.100 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కొత్తి మీర కట్ట రూ.30కి చేరింది. పుదీన కట్ట కూడా రూ.20కు తక్కువ లేదని వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. గోంగూర, తోటకూర, పాలకూర తదితర ఆకు కూరలు 3 కట్టలు గతంలో రూ.15 కాగా ప్రస్తుతం రూ.20కి చేరాయి. మరోవైపు రోజువారీ డిమాండ్ ఆధారంగా ధరలు హెచ్చు తగ్గులు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో పేద మధ్య తరగతి జీవన శైలి భారంగా మారింది. నిత్యావసర ధరల నియంత్రణ లేకపోవటంతో దళారులు రాజ్యమేలుతున్నారు.

# నాడు ఇతర రాష్ట్రాలకు ఎంతకిచ్చారు



## ఏపీతో విద్యుత్ ఒప్పందంపై పూర్తి వివరాలు ఇవ్వండి
## అఫిడవిట్ దాఖలు చేయండి
## సెకీకి హైకోర్టు ఆదేశం.. విచారణ వాయిదా

%అమరావతి, ఆగస్టు 7(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో యూనిట్ ధర రూ.2.49 చొప్పున 7 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా ఒప్పందం చేసుకునేనాటికి.. ఇతర రాష్ట్రాలకు ఎంత ధరకు ఇస్తున్నారో చెప్పాలని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)ని హైకోర్టు ?ఆదేశించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ వేయాలని స్పష్టం చేసింది. యూనిట్ విద్యుత్ ధరను ఆమోదిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఇచ్చిన ఉత్తర్వులను కూడా తమ ముందుంచాలని పేర్కొంది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. సెకీ నుంచి యూనిట్ రూ.2.49 చొప్పున 7 వేల మెగావాట్ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి(సీఈఆర్సీ) ధ్రువీకరించడాన్ని సవాల్ చేస్తూ అప్పటి టీడీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హైకోర్టులో వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సెకీ నుంచి యూనిట్ రూ.2.49కి కొనుగోలు చేసేందుకు ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని.. అదే సెకీ గుజరాత్ ప్రభుత్వానికి యూనిట్ రూ1.99కే సరఫరా చేస్తోందని తెలిపారు. విద్యుత్ చట్టంలోని సెక్షన్లు 62, 63 ప్రకారం విద్యుత్ కొనుగోలు ధరను టెండర్ ప్రక్రియ ద్వారా ఖరారు చేయాల్సి ఉంటుందన్నారు. సెకీ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ నుంచి రాష్ట్రం విద్యుత్ కొనుగోలు చేస్తోందని.. అంతదూరం నుంచి విద్యుత్ సరఫరాతో నష్టంతో పాటు వినియోగదారులపై ట్రాన్స్‌మిషన్ చార్జీల భారం పడుతోందని తెలిపారు. అదే ప్లాంటును రాష్ట్రంలో ఏర్పాటు చేసినట్లైతే ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించడమే గాక.. వినియోగదారులకు తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. యూనిట్ ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో పిటిషన్లు వేశారని.. అంతిమంగా ధర ఆమోదించే విషయంలో ఏపీఈఆర్సీకి హైకోర్టు వెసులుబాటు ఇచ్చిందని.. సెకీ నిర్ణయించిన రూ.2.42 ధరను ఏపీఈఆర్సీ ఆమోదించిందని.. ఆ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే పిటిషనర్లు సవాల్ చేసుకోవచ్చని తెలిపారు. సెకీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం నాటికి ఇతర రాష్ట్రాలకు యూనిట్‌కు రూ.2.52 నుంచి 2.61 వరకు సరఫరా చేశామని తెలిపారు. పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు సమయం కోరారు.

# పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వెళ్తూ..



ఓర్వకలుఆగస్టు 7(టుడే విదుర):పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వెళ్తూ ఓ వృద్ధుడు అనంతలోకాలకు చేరాడు. ఈ ఘటన మండలంలోని కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి-40పై సోమయాజులపల్లె గ్రామానికి సమీపంలో గల బేతంచెర్ల యూటర్న్ వద్ద చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలు.. సోమయాజులపల్లెకి చెందిన వెంకట రమణ(65) తన కుమారుడు మధుబాబు పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు చెన్నంచెట్టిపల్లె గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. గ్రామానికి సమీపంలో యూటర్న్ వద్ద దాటుతుండగా నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న మినీ బస్సు ఢీకొనడంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల ఘటనాస్థలికి చేరుకొని శోకసంద్రంలో మునిగి పోయారు. మృతుని కుమారుడు మధుబాబు వివాహం ఈనెల 13, 14 తేదీల్లో జరగాల్సి ఉంది. మృతుడికి ఐదు మంది కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఇంటిపై ముువ్వన్నెల జెండా ఎగరాలి



అనంతపురం వైద్యం, ఆగస్టు 7(టుడే విదుర):: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించాలని డీఎంహెచఓ డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం డీఎంహెచఓ భవనంపై ఆమె జాతీయ జెండాను ఎగుర వేసి వందనం సమర్పించారు. కార్యక్రమంలో ఏఓ గిరిజా మనోహర్ రావు, పలువురు డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డెమో త్యాగరాజు, హెచఈఓ నాగరాజు, డిప్యూటీ హెచఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# 21.5 కిలోల గంజాయి స్వాధీనం





ఆమదాలవలస,ఆగస్టు 7(టుడే విదుర):): గంజాయి ర వాణా చేస్తున్న ము గ్గురు యువకులతో పాటు ఒక మైనర్ ను అరెస్టు చేసి, వారి నుంచి 21.5 కిలోలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మునిసిపాలిటీ పరిధి 18వ వార్డు కంద్రపేట శ్మశాన వాటిక వద్ద ఎస్ఐ బాలరాజు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఇద్దరు యువకులు ఒక మైనర్ గంజాయితో పట్టుబడ్డారు. కొత్త కంద్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, ఐదో వార్డు సొట్టవానిపేట టీజీఆర్ నగర్ కాలనీకి చెందిన సయ్యద్ తహీర్‌బాబుతో పాటు ఒక మైనర్ గంజాయిని ఒడిశా రాష్ట్రం కల్లికోట్‌కు చెందిన నీలాంచల్ పట్నాయక్ వద్ద కొనుగోలు చేసి రైలులో ఆమదాలవలసకు తీసుకువస్తూ కొంత వీరు సేవించి.. మరికొంత విక్రయిస్తుండేవారు. ఈ నేపథ్యంలోనే బుధవారం కూడా గంజాయిని కొనుగోలు చేసి తీసుకువస్తుండగా పట్టుబడ్డారు. గంజాయిని ఒడిశాకు చెందిన నీలాంచల్ పట్నాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కారుణ్య జగదీష్‌పై ఇప్పటికే తొమ్మిది కేసులున్నాయని, 2024లో గంజాయి కేసు నమోదైందని ఇతడిపై స్టేషన్‌లో హిస్టరీషీట్ కూడా ఉ న్నట్టు తెలిపారు. సయ్యద్ తాహిర్‌పై రెండు దొంగతనాల కేసులున్నాయన్నారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించ నున్నట్టు తెలిపారు. మైనర్‌ను జువైనల్ హోంకు తరలిస్తామన్నారు.

# ఇంటి పట్టాలు ఇవ్వాలి: సీపీఎం




కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 7(హేలాపురి న్యూస్): నగరంలోని బాలగంగాధర్ తిలక్ నగర్ ప్రజలకు ఇంటి పట్టాలని ఇవ్వాలని కోరుతూ కొత్తబస్టాండు ఎదురుగా రాస్తారోకో చేపట్టారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకోలో న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ 42వ వార్డు తిలక్ నగర్‌లో ప్రజలు గత 50 సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి జీవో నెంబరు 30 ప్రకారం రెగ్యులరైజ్ చేస్తూ ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సి.గురు శేఖర్, వై.నగేష్, నగర కార్యదర్శివర్గసభ్యులు సీహెచ. సాయిబాబా, కే.సుధాకరప్ప, కిరణ్మయి పాల్గొన్నారు.


# కొండపికి సాగర్ నీరు



## నియోజకవర్గంలో తాగు, సాగు కోసం 0.60 టీఎంసీలు
## %మంత్రి స్వామి విజ్ఞప్తితో ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు, ఆగస్టు 7(టుడే విదుర): కొండపి నియోజకవర్గంలో ప్రత్యేకించి ముసి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో తాగు, సాగునీటికి కొంత ఊరట కలగనుంది. వర్షాధారమే ఆ ప్రాంతంలో సాగు, తాగునీటి వనరు కాగా ఏటా సరైన వర్షాలు లేక పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యా మ్నాయంగా సాగర్ నీటిని ఒంగోలు బ్రాంచి కాలువ నుంచి ముసి నదికి ఇవ్వడం ద్వారా తన నియోజకవర్గంలోని వాగు పరివాహక ప్రాంత ప్రజలు తాగునీటి ఇక్కట్ల నుంచి ఉపశమనం కల్పించాలని కోరారు. ఆయన వినతిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఓబీసీపై రామతీర్థం ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వెలుగువారిపాలెం సమీపంలో ఉన్న 23.17 కి.మీ వద్ద ఎస్కేప్ నుంచి ముసికి 0.60 టీఎంసీల నీరు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ మేరకు పభ్రుత్వ ప్రత్యేక కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. రామతీర్థం రిజర్వాయర్ నిండి ఒంగోలు బ్రాంచి కాలువలో నీరు సరఫరా బాగా ఉన్న సమయంలో ఈ నీటిని ముసికి వదలాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఒంగోలులోని ప్రాజెక్టు సీఈని ఆదేశించారు.

# వర్షంతో పంటకు ఊపిరి



ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 7(టుడే విదుర): రెండు రోజులుగా డివిజన్‌లో కురు స్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు ఊపిరి పోశా యి 20 రోజులుగా మొఖం చాటేసిన వర్షాలు కురియడంతో పత్తి, వేరుశనగ అముదం, ఇతర పంటలు కళకళలాడుతున్నాయి ఆదోని, కౌతాళం, కోసిగి, పెద్ద కడుబూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 85,289 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అత్యధికంగా 60,235 హెక్టార్లలో పత్తి పంట సాగు కాగా, వేరుశనగ 12,255తోపాటు మిగతా ఆముదం, మిరప, ఉల్లి, జొన్న, కంది సాగునట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అధికంగా రసాయనిక ఎరువులు వాడొద్దని వ్యవసాయి అధికారుల సూచనలకు మేరకు ఉపయోగించాలని ఏడీఏ బాలవర్ధిని రాజు తెలిపారు. వర్షాలు కురడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు



మలికిపురం,ఆగస్టు 7(టుడే విదుర):: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురానికి చెందిన కడలి కరుణ, కడలి రేవతి అక్కాచెల్లెళ్లు. వారిద్దరు ఎస్ఐ కోచింగ్ తీసుకుని ఒకేసారి ఎంపికయ్యారు. వారికి మోకా సత్తిబాబు కోచింగ్ సెంటర్ నందు ఉచిత కోచింగ్ అవకాశం కల్పించారు. అక్కాచెల్లెళ్లు ఎస్ఐలుగా ఎంపికవ్వగా విజయవాడసిటీ పోలీసు స్టేషన్‌లో పోస్టింగ్ లభించింది. వారి తండ్రి వెంకటేశ్వర్లు చికెన్ సెంటర్ నందు పనిచేస్తుండగా తల్లి గృహిణి. వారికి ఎస్ఐలుగా పోస్టింగ్ రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రశ్నిస్తే చితకబాదుతారా?

**గాయపడిన వెంకటరమణ**
**అన్యాయంగా కేసులు పెట్టించారు**
**పోలీసుస్టేషన్ ఎదుట ప్రజల నిరసన**
**తాము ఎవరినీ కొట్టలేదన్న ఎస్ఐ**



శ్రీకాకుళంఆగస్టు 7(టుడే విదుర): కొత్తూరు పోలీసుస్టేషన్ ఎదుట శోభనాపురం తదితర గ్రామాల ప్రజలు బుధవారం నిరసన తెలిపారు. శోభనాపురం గ్రామానికి చెందిన గెల్లంకి వెంటరమణను కొత్తూరు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ చితకబాదారని, తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. శోభనాపురం క్వారీ వద్ద భారీగా బ్లాస్టింగ్ చేస్తుండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, దీంతో బ్లాస్టింగ్ నిలుపుదల చేయాలని అడ్డుకున్నందుకు కొంతమంది నాయకు ల ప్రోద్బలంతో పోలీసులు కొట్టారని గెల్లంకి వెంటరమణ ఆరోపించారు. న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళితే తనపై దాష్టికంగా దాడి చేశారన్నారు. వెంకటరమణ ప్రజలతో కలిసి పోలీసుస్టేషన్‌కు వెళ్లి నిలదీయగా.. పోలీసులు, ప్రజల మధ్య చిన్నపాటి తోపులాట జరిగినట్లు తెలిసింది. అనంతరం పోలీసులు తనను కొట్టడంతో గాయాలపాలై కొత్తూరు ఆసుపత్రిలో చేరానని, కొత్తూరు వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారని వెంకటరమణ తెలిపారు. అయితే తమను ఇబ్బందులు పెడు తున్నారంటూ వెంకటరమణపై క్వారీ నిర్వాహకులు మూడు రోజులు క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారని, దీంతో ఆదివారం వెంకటరమణపై కేసు నమోదు చేసి 41 నోటీసు ఇచ్చి బెయిల్‌పై విడుదల చేశామని కొత్తూరు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ తెలిపారు. వెంకటరమణను కొట్టారని చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదన్నారు. తనపై నమోదు చేసిన కేసును కప్పి పుచ్చుకోవడానికి కొంతమందిని తీసుకువచ్చి హంగామా చేశారన్నారు.

# జలాశయాలకు తగ్గిన ప్రవాహం



గుంటూరు జిల్లా ప్రతినిధి/ విజయపురిసౌతఆగస్టు 7(టుడే విదుర): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రధాన జలాశయాలకు ఎగువ నుంచి వరద ప్రవాహం తగ్గింది. శ్రీశైలం నుంచి వరద ప్రవాహం తగ్గడంతో నాగార్జున సాగర్‌కు వస్తున్న ప్రవాహం తగ్గింది. ఎగువ నుంచి సాగర్‌కు 66,131 క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 306 టీఎంసీలుగా ఉంది. సాగర్ నుంచి 44,108 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల గరిష్ట నీటి నిల్వ 45.77 టీఎంసీలుకాగా ప్రస్తుతం 42.82 టీఎంసీల నిల్వ ఉంది. పులిచింతలకు ఎగువ నుంచి 30,489 క్యూసెక్కుల నీరు వస్తుండగా 45,104 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద గరిష్ట నీటి నిల్వ 3.07 టీఎంసీలు కాగా పూర్తి స్థాయిలో నీల్వలు ఉండటంతో ఎగువనుంచి వస్తున్న 40,005 క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. అటు సాగర్ కాల్వలకు గరిష్ఠంగా 15 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇటు డెల్టాలో ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వలకు గరిష్ఠంగా 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

# కొండెక్కిన పూల ధర



ఆగస్టు 7(టుడే విదుర):పెళ్లిల్లు, శుభముహూర్తాలు, శ్రావణ శుక్రవారం వ్రతాలు ఒకేసారి రావడంతో పూల ధరలకు రెక్కలు వచ్చాయి. కడియపులంక అంతర్రాష్ట్ర పూల మార్కెట్ అమ్మకం, కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. ప్రస్తుత సీజన్‌లో ఉభయగోదావరి జిల్లాల్లో పూల దిగుబడులు అంతగా లేకపోవడంతో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు చిత్తూరు జిల్లా నుంచి బంతి, చామంతి, గులాబీ వంటి రకాలను టన్నులు కొలది మార్కెట్‌కు దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే వివాహాది శుభకార్యాలకు కావలసిన డెకోరేషన్ పువ్వులను బెంగుళూరు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే శ్రావణ శుక్రవారంకు కావలసిన పూల కొనుగోలు నిమిత్తం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాలతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వ్యాపారులు వచ్చి పూలను కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. ఆర్డర్లపై స్థానిక పూల వ్యాపారులు ఆర్‌టిసి బస్సులు ద్వారా ఎగుమతులు చేపట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల కడియం, ఆలమూరు, ఆత్రేయపురం మండలాలలో సాగయ్యే కనకాంబరం, లిల్లీ, మల్లె, జాజులు, గులాబీ వంటి పూల పంటలు దారుణంగా దిగుబడి తగ్గింది. అందువల్ల ప్రస్తుత సీజన్లో వాటి ధరలు మరింత అధికమయ్యాయి. బుధవారం కడియపులంక పూల మార్కెట్లో పూల ధరలు ఈ విధంగా ఉన్నాయి. చామంతి కేజీ రూ.400–450, వైట్ చామంతి రూ.460, ఎరుపు చామంతి రూ.400, నీలం చామంతి రూ.300, బంతి రూ.100 నుంచి 120, కనకాంబరాల బారు రూ.150 నుంచి 170, గులాబీ రూ.250, జాజులు రూ.600, లిల్లీ రూ.450, మల్లె రూ.1000, హైబ్రిడ్ గులాబీ కట్ట రూ.250 ధర పలుకుతోంది.

# మన్యంలో భిన్న వాతావరణం

పాడేరు,ఆగస్టు 7(టుడే విదుర):ఏజెన్సీలో భిన్నమైన వాతావరణం నెలకొంది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని దాదాపుగా అన్ని మండలాల్లోనూ తీవ్రమైన ఎండకాసింది. కానీ ఒడిశా రాష్ట్రాన్ని ఆనుకుని ఉన్న ముంచంగిపుట్టు మండలంలో మాత్రం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పాడేరులో ఉదయం నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు తీవ్రమైన ఎండకాసింది. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవించి ఆకాశమంతా మేఘావృతమైంది. అప్పటి వరకు ఎండతో వేడెక్కిన వాతావరణం చల్లబడింది. దీంతో జనం కాస్త ఉరట చెందారు. అదే సమయంలో ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ముంచంగిపుట్టులో వర్షం కురవగా, ఇతర ప్రాంతాల్లో మబ్బుల వాతావరణం నెలకొంది.

# త్వరలో డీఎస్సీ ఫలితాలు



ఎచ్చెర్లఆగస్టు 7(టుడే విదుర):: మెగా డీఎస్సీ ఫలితాలను విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటుంది. మరికొద్ది రోజుల్లో ఫలితాలు విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. జిల్లాకు సంబంధించి 543 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. డీఎస్సీ పరీక్షలు ఈ ఏడాది జూన్ 6 నుంచి జూలై 2వ తేదీ వరకు జరిగాయి. జిల్లాలోని ఐదు కేంద్రాలతో పాటు ఒడిశాలోని ఓ కేంద్రంలో జరిగిన ఈ పరీక్షలను 35వేల మంది అభ్యర్థులు రాశారు. జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులు ఎక్కువగా ఉన్న తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, చిత్తూరు, కర్నూలు జిల్లాలకు వెళ్లి డీఎస్సీ రాశారు.

# రొయ్యకు ట్రంప్ దెబ్బ

**గణనీయంగా పడిపోయిన ధరలు**
**ఇంకా దిగజారుతాయన్న భయంలో రైతులు**
**అమెరికా ఆంక్షలతో సంకట స్థితిలో ఆక్వా రంగం**



ఒంగోలు నగరం, ఆగస్టు 7(టుడే విదుర): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో జిల్లాలోని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ దేశ ఆంక్షలతో ఇప్పటికే ఇక్కడ రొయ్యల ధరలు దిగజారిపోయాయి. రెండు మూడు రోజుల వ్యవధిలోనే కిలోకు రూ.30 తగ్గించి వ్యాపారులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. ట్రంప్ సుంకాల దెబ్బతో ఇంకా ధరలు పడిపోతాయనే భయంతో రైతులు చెరువులను హార్వెస్టింగ్ చేస్తున్నారు. జిల్లాలో 15వేల ఎకరాల్లో వెనామీ, టైగర్ రకం రొయ్యల సాగు జరుగుతోంది. ఇవి అమెరికాకు కూడా ఎగుమతి అవుతాయి. మన దేశం నుంచి అక్కడికి వెళ్లే ఉత్పత్తులపై ట్రంప్ 25శాతం సుంకం విధిస్తున్నట్లు ఇటీవల ఒక ప్రకటన చేశారు. ఆ ప్రభావంతో ధరలు తగ్గుముఖం పడుతుం డటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడు తున్నారు. గత వారంలోనే మూడు రోజులపాటు వ్యాపారులు రొయ్యల కొనుగోళ్లను నిలిపివేయడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. సోమవారం నుంచి పునఃప్రారంభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే ధరలను గణనీయంగా తగ్గించారు. ఇంకా ధరలు తగ్గిపోయే అవకాశం ఉందని భావిస్తున్న రైతులు దక్కినకాడికే అనుకుంటూ చెరువులను తీసేస్తున్నారు.

# లేపాక్షిలో గరుడ గృహోపకరణాల తయారీ యూనిట్

విజయవాడ,ఆగస్టు 7(టుడే విదుర): అనంతపురం జిల్లా లేపాక్షిలో గరుడ మార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ చైర్మన్ ఆర్.వెంకట రమణ తెలిపారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం కర్ణాటకలోని చిక్‌బళ్లాపుర జిల్లా కైవారాలో ఈ తయారీ కేంద్రం ఉ ందని, 2017లో ఈ యూనిట్‌ను నెలకొల్పామని చెప్పారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కర్ణాటక ప్రభుత్వం రెండెకరాల భూమి కేటాయించగా, మరో యూనిట్‌ను నిర్మిస్తున్నామని, ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షిలో కూడా ఆరు ఎకరాల విస్తీర్ణంలో యూనిట్ ఏర్పాటు చేయబోతున్నట్టు వెల్లడించారు. సుమారు రూ.100 కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని, 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. గరుడలో తయారైన గృహోపకరణాలకు రాష్ట్రంలో 400 మంది డీలర్లు ఉన్నారని వెంకట రమణ తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేయబోయే యూనిట్‌కు ప్రభుత్వం సహకరించాలని కోరారు.

# ఎస్ఈల సీనియారిటీ జాబితాకు ఆమోదం

అమరావతి, ఆగస్టు 7(టుడే విదుర): పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం(పీహెచ్ఎంఈడీ)లో సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎసఈ)ల జాబితాను మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ విడుదల చేసింది. 38 మంది ఎస్ఈల సీనియారిటీ జాబితాను ఆమోదిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అదనపు డైరెక్టర్ ఎస్.రవీంద్రబాబును సీడీఎంఏ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్(సెలక్షన్ గ్రేడ్)గా, సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ జి.రవిని రాయచోటి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ కమిషనర్‌గానూ, అక్కడ ఉన్న వాసుబాబును నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ టీపీఆర్‌వోగా నియమించారు. పి.భవానీ ప్రసాద్‌ను శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా, గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్ ఎల్.సురేశ్‌ను శ్రీకాకుళం పట్టణాభివృద్ధి అథారిటీ గ్రేడ్–1 సెక్రటరీగా నియమించారు. టీటీ రత్నకుమార్‌ను సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.కొండయ్యను ప్రొద్దుటూరు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా, కదిరిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బి.ప్రహ్లాద్‌ను కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.

# అనాథపిల్లలకు అన్నదానం



తాడిపత్రి, ఆగస్టు 7(టుడే విదుర): మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామసమీపంలోని శ్రీ రమణ మహర్షి అనాథ ఆశ్రమంలోని 120 మంది చిన్నారులకు పుట్లూరు మండలం కోమటికుంట్ల గ్రామానికి చెందిన నవీన అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అతని స్నేహితులు నరేష్, పవన, ప్రవీణ్, వేణు, షరీఫ్ పాల్గొన్నారు.

# వారందరికీ వర్క్‌ఫ్రమ్ హెూం ఇవ్వండి..



హైదరాబాద్ ఆగస్టు 7(టుడే విదుర): వర్షాల నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలకు ఐటీ కారిడార్‌లో వర్షాలకు రోడ్లన్నీ జలమయమవడంతో ట్రాఫిక్ సమస్యలు మరింత ఎక్కువవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ డాక్టర్ గజరావు భూపాల్ వాతావరణ శాఖ సమాచారం మేరకు సైబరాబాద్ పరిధిలోని ఐటీ కంపెనీల నిర్వాహకులకు బుధవారం సూచనలు చేశారు. %వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ కాకుండా ఐటీ ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హెూం ఇవ్వాలని సోషల్ మీడియా వేదికగా సమాచారాన్ని పోస్టు చేశారు. ఆఫీసులకు వచ్చిన ఉద్యోగులందరూ ఒకేసారి లాగవుట్ కాకుండా సాయంత్రం 4.30 గంటల నుంచి దశల వారీగా బయటకు రావాలని సూచించారు. సైబరాబాద్ పరిధిలో కురిసే వర్షంపై ఐటీ కంపెనీలకు, ఉద్యోగులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు చేపడుతున్నారు.

# తెలంగాణలో డ్రగ్స్ దందా..
## ఎక్సైజ్ శాఖ పకడ్బందీ తనిఖీలు




హైదరాబాద్, ఆగస్టు 7(టుడే విదుర):నగరంలో పోలీసులు ఇవాళ(గురువారం) తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు ఓ వ్యక్తి తీసుకువచ్చారు. ఆ డ్రగ్స్‌ను శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాల్లో కడపకు చెందిన గుత్తా తేజ కృష్ణకు విక్రయిస్తుండగా చాకచక్యంగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 5.14 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిని అదుపులోకి తీసుకుని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు విచారిస్తున్నారు. ఈ విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.మరో కేసులో.. మహేష్‌రెడ్డి అనే వ్యక్తి.. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన వ్యక్తి నుంచి 510 గ్రాముల గంజాయిని విక్రయిస్తుండగా.. మల్కాజిగిరి పోలీసులు రెడ్ హ్యాండెండ్‌గా పట్టుకున్నారు. నిందితుల దగ్గర ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకోని పోలీసులు విచారిస్తున్నారు. అలాగే, ఘట్‌కేసర్ ప్రాంతంలో 1.227 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. నాగపూర్ నుంచి బస్సులో గంజాయి తరలిస్తున్నారని ఎస్‌టీఎఫ్‌సీ టీం సీఐ వెంకటేశ్వర్లు నుంచి సమాచారం అందడంతో నాగపూర్ నుంచి వస్తున్న బస్సులను కొంపెల్లి, బాలాజీనగర్, జవహర్‌నగర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభురాజ్ అనే వ్యక్తి నుంచి 1.227 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న నిందితుడిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు హెచ్‌డీఎఫ్‌బీ టీమ్ ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఈ కేసుల్లో గంజాయి, డ్రగ్స్‌లను పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, బీ టీం లీడర్ ప్రదీప్ రావులు అభినందించారు.

# దొంగ డెత్‌సర్టిఫికెట్‌తో ఎల్‌ఐసీకి టోకరా

## భద్రాద్రి కొత్తగూడెంలో మోసానికి పాల్పడిన ఏజెంట్
## పాలసీదారుడికి తెలియకుండానే అతడి పేరిట బీమా
## ఆ వ్యక్తి బతికే ఉన్నా.. అతని పేరుతో డెత్ సర్టిఫికెట్ సృష్టి

కుక్కునూరు,ఆగస్టు 7(టుడే విదుర): తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ ఎల్‌ఐసీ ఏజెంట్.. ఏలూరు జిల్లా కుక్కునూరుకి చెందిన వ్యక్తి డెత్ సర్టిఫికెట్‌తో బీమా సొమ్ము స్వాహా చేశాడు. తొలుత ఆ వ్యక్తికి తెలియకుండా, అతడి పేరిట ప్రీమియం కడుతూ.. ఈ ఘరానా మోసానికి పాల్పడ్డాడు. తర్వాత అతడితో స్నేహం చేసి, ఓ కట్టుకథ అల్లి, అతడి పేరిట డెత్ సరిఫికెట్ సంపాదించాడు. దాంతో సొమ్ము డ్రాచేశారు. చివరికి పంపకాల్లో తేడా రావడంతో గుట్టు రట్టయి.. సదరు ఎల్‌ఐసీ సంస్థ ఆ సొమ్మును రికవరీ చేయడంతో పాటు భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలివీ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బుర్గంపాడు మండలానికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ యాకూద్ బాషా 2017లో అదే మండలంలోని సారపాక గ్రామం భాస్కర్‌నగర్ వీధికి చెందిన భూక్యా శ్రీరాములు పేరున అతడికి తెలియకుండానే ఎల్‌ఐసీ పాలసీ కట్టాడు. అప్పటి నుంచి యాకూద్ బాషాయే ప్రీమియం చెల్లించుకుంటూ, తెలివిగా శ్రీరాములుతో స్నేహం చేశాడు. 2024 జూన్‌లో శ్రీరాములు వద్దకు వెళ్లి 'నీ పేరు గల వ్యక్తి ఆంధ్రాలోని కుక్కునూరు మండలంలో ఉన్నాడని, అతడు ఇటీవల మృతి చెందాడని అతడి పేరుపై ఎల్‌ఐసీ పాలసీ ఉందని, సహకరిస్తే రూ.10 లక్షలు వస్తాయ'ని నమ్మించాడు. మరో వ్యక్తితో కలిసి యాకూద్ ఈ పథకాన్ని అమలు చేశాడు. కుక్కునూరు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి శ్రీరాములు మృతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్ సంపాదించాడు. దాని ఆధారంగా క్లెయిమ్ చేయడంతో శ్రీరాములు భార్య ఖాతాలో రూ.10లక్షల బీమా పరిహారం జమ అయింది. డబ్బులు డ్రా చేసి శ్రీరాములు వాటాగా రూ.3లక్షలు ఇచ్చి మిగిలిన సొమ్మును ఎల్‌ఐసీ ఏజెంట్ యాకూద్ బాషా తీసుకున్నాడు. అనంతరం మూడో వ్యక్తితో పంపకాల్లో తేడా రావడంతో, అతడు ఈ విషయాన్ని బట్టబయలు చేశాడు. దీంతో ఎల్‌ఐసీ అధికారులు వారి నుంచి సొమ్మును రికవరి చేసి భద్రాచలం పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సూత్రధారి యాకూద్‌బాషాతోపాటు కుక్కునూరు పంచాయతీ నుంచి జారీ అయిన సర్టిఫికెట్‌పై కొందరిని భద్రాచలం పిలిపించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

# ఇదేం విడ్డూరం..
## గుండ్రంగా తిరుగుతున్న చింత మొక్క





ఆగస్టు 7(టుడే విదుర):భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ వింత, విచిత్రమైన సంఘటన ఒకటి చోటుచేసుకుంది. ఓ చింత మొక్క అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఆ మొక్క తనంతట తాను గుండ్రంగా తిరుగుతోంది. జిల్లాలోని ములకలపల్లి మండలం సీతారాంపురం గ్రామంలో ఈ వింత సంఘటన వెలుగు చూసింది. చింత మొక్క అలా గుండ్రంగా తిరగటం చూసిన జనం ఆశ్చర్యపోతున్నారు. ఈ విషయం తెలిసి పెద్ద ఎత్తున మొక్క దగ్గరకు జనం తరలివస్తున్నారు. చింత మొక్కను వీడియో తీస్తున్నారు.చింత మొక్క అలా గుండ్రంగా తిరగటం దేవుడి లీలా లేక సృష్టి మాయా అనే సందేహంలో స్థానికులు ఉన్నారు. బ్రహ్మంగారి కాలజ్ఞానం నిజమవుతుందా అని చర్చించుకుంటున్నారు. ఇక, ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఏముందంటే.. ఓ చిన్న చింత మొక్క అటు, ఇటు కదులుతూ ఉంది. అది గాలికి కదులుతున్నట్లుగా లేదు. ఎవరో కిందినుంచి అటు, ఇటు తిప్పుతున్నట్లుగా ఉంది.ఇక, వైరల్‌గా మారిన ఈ వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు.. 'మొక్క కింది భాగంలో ఏదో జీవి ఉండి ఉంటుంది. అది అటు, ఇటు తిరుగుతూ ఉంది. అందుకే మొక్క కూడా తిరుగుతూ ఉంది. అందులో ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఏమీ లేదు'..'ఇది నిజంగా దేవుడి లీలే.. బహుశా బ్రహ్మం గారు చెప్పింది నిజమే అవుతుంది కావచ్చు'..'ఇలా మా ఊర్లో చాలా సార్లు జరిగింది. అందులో వింత ఏమీ లేదు' అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# సంధ్య థియేటర్ ఘటనపై సీఎస్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

న్యూఢిల్లీ, ఆగస్టు 7(టుడే విదుర): పుష్ప-2 సినిమా ప్రదర్శన సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద గత డిసెంబరు 3న జరిగిన తొక్కిసలాటపై జాతీయ మానవ హక్కుల సంఘం(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించగా ఆమె కుటుంబానికి రూ.5లక్షల నష్టపరిహారం ఎందుకు చెల్లించకూడదు ? అని ప్రశ్నించింది. ఇక, శాంతి భద్రతల నిర్వహణలో పోలీసు శాఖ నిర్లక్ష్యం కనిపిస్తోందని ఎన్‌హెచ్‌ఆర్‌సీ అభిప్రాయపడింది. మొత్తం ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి ఆరు వారాల్లోపు నివేదిక సమర్పించాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ (శాంతి భద్రతలు)ను ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది. కాగా, సంధ్య థియేటర్ వద్ద లాఠీచార్జి, తొక్కిసలాటలో రేవతి మరణం, ఆమె ఇద్దరు పిల్లలు గాయపడడంపై ఇమ్మనేని రమణారావు అనే న్యాయవాది చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ నోటీసులు జారీ చేసింది.

# చిన్నారిపై టీచర్ అమానుషం!



సైదాబాద్, ఆగస్టు 7(టుడే విదుర):: పసిపిల్లాడని కూడా చూడకుండా.. ఎల్‌కేజీ విద్యార్థిని ఓ టీచర్ నిర్దాక్షిణ్యంగా లంచ్ బాక్స్‌తో కొట్టిన ఘటన సైదాబాద్ పోలీసస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. ఎల్‌సీహెచ్ కాలనీలో నివాసముండే ఆవుల మణికంఠ కుమారుడు ఈశ్వర్.. ఇంటికి దగ్గరలోని లిటిల్ ఇండియన్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. మధ్యాహ్నం సమయంలో.. ఈశ్వర్‌కు తలకు గాయమై, రక్తస్రావం అవుతోందని తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ సమాచారమందించారు. వెంటనే వారు స్కూల్‌కు చేరుకుని కుమారుడిని స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు.

# రంగు నీళ్లతో
## బస్తీ వాసుల పరేషాన్...




హైదరాబాద్:ఆగస్టు 7(టుడే విదుర): నాలాలో కలుషిత జలాలు ప్రజలను కలవర పెట్టాయి. మురుగు నీటి కాలువలో నీరు ఎర్రగా మారడంతో రసాయన జలాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10 సింగాడి బస్తీ( నుంచి తాజ్ బంజారా వరకు ఉన్న నాలాలో ఎర్రటి నీటి ప్రవహించింది. ఈ కలుషిత నీరు బంజారా చెరువులో కలుస్తోంది. రోడ్డు నంబరు 14 నూర్‌నగర్, నందినగర్‌లో దుస్తుల డైయింగ్ కేంద్రాలు అనేకం ఉన్నాయి.వారు వ్యర్థాలను డ్రైనేజీలోకి వదిలేస్తున్నారు. గతంలో స్థానికంగా ఉన్న బోర్‌వెలల నుంచి కూడా రంగు నీరు వస్తుందనే ఫిర్యాదులు ఉన్నాయి. డైయింగ్ కేంద్రాల నుంచి వ్యర్థాలు నాలాలో కలిసి నీరు రంగు మారుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా రంగునీరు కనిపించడం ఇది మొదటిసారి కాదంటున్నారు. నీరు రంగు మారడంపై జలమండలికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

# టుడే వినోదం



## ప్రభాస్ రాజాసాబ్.. నిర్మాత క్లారిటీ ఇచ్చేశారు..




కొంతకాలంగా టాలీవుడ్‌లో రెండు పార్టుల ట్రెండ్ నడుస్తోంది. అగ్ర హీరోలు నటించే చిత్రాల్లో కొన్ని రెండు పార్టులుగా విడుదల చేయడం మొదలెట్టారు. దానికి కారణం కథలో ఉన్న బలం కావచ్చు.. సినిమా నిడివి పెద్దదిగా ఉండడం కావచ్చు. గడిచిన పదేళ్లలతో తీసుకుంటే బాహుబలితో ఈ ట్రెండ్ మొదలైంది. ఇప్పుడు ప్రభాస్ నటించే ఏ సినిమా అయినా పాన్ ఇండియా స్థాయిలో విడుదల పక్కా. అది కూడా రెండుపార్టులుగా తీయడం కామన్ అయిపోయింది. ప్రస్తుతం అలాంటి చిత్రాలు రెండు సెట్స్ మీదున్నాయి. అవి 'కల్కి 2', 'సలార్ 2'. వీటిని పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది రాజాసాబ్'కరెండు పార్టులుగా రానున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. టీజర్ రిలీజ్ సమయంలో దర్శకుడు మారుతి కూడా ఇచ్చీ ఇవ్వనట్లు హింట్ ఇచ్చారు. అయితే ఇప్పుడు నిర్మాత టీజీ విశ్వప్రసాద్ స్పష్టత ఇచ్చారు. 'రాజాసాబ్ 2' ఉంటుందని చెప్పారు. కానీ తొలి భాగానికి కొనసాగింపులా కాకుండా థీమ్, సెటప్ ఒకే తరహాలో ఉంటాయయన్నారు.అనంతరం సినిమా విడుదల తేదీపై స్పందించారు. 'ప్రభాస్ అభిమానులు, తెలుగు పంపిణీదారులు సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల చేయాలని కోరుతున్నారు. హిందీ ప్రేక్షకులు మాత్రం డిసెంబర్ 5న విడుదల చేయాలంటున్నారు. అయితే మేం ఏ తేది అనుకున్నామో అదే తేదికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తాం. అక్టోబర్‌కి సినిమా మొత్తం పూర్తి కానుంది' అని విశ్వప్రసాద్ తెలిపారు. ఇందులో నిధీ అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ కథానాయికలుగా నటిసున్నారు. సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## మంచు లక్ష్మీని ఆటపట్టించిన అల్లు అర్హా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ముద్దుల కూతురు అల్లు అర్హా కు ఓ గొప్ప సందేహం వచ్చింది. ఇటీవల మంచు లక్ష్మీ వారి ఇంటికి వెళ్ళినప్పుడు ఆ సందేహాన్ని అర్హ తీర్చేసుకుంది. మంచు లక్ష్మీ... అర్హను ఉద్దేశించి... 'నువ్వు నన్నేదో అడగాలని అనుకున్నావట కదా... ఏంటది' అని అడిగింది. 'నువ్వు తెలుగేనా' అనే సందేహాన్ని అల్లు అర్హ.. మంచు లక్ష్మీ ముందు పెట్టింది. దాంతో కాస్తంత కన్ ఫ్యూజన్ కు గురైన లక్ష్మీ 'అదేమిటీ? నేనే నీతో మాట్లాడుతోంది తెలుగులోనే కదా... నీకెందుకు ఆ సందేహం కలిగింద'ని ఎదురు ప్రశ్నించింది. 'ఏం లేదు... నీ ఆక్సెంట్ అలా అనిస్తోంద'ని నవ్వుతూ బదులిచ్చింది అర్హ. 'నీది కూడా అలాగే ఉంటుంది కదా' అని నవ్వేస్తూ అర్హా తలపై ముద్దుపెట్టేసింది మంచు లక్ష్మీ! %నిజానికి అర్హ కు వచ్చిన సందేహం కొన్నేళ్ళుగా చాలామందికి ఉన్నదే! మంచు లక్ష్మీ ఎంత విదేశాలలో ఉండి చదువుకున్నా... డైలాగ్ కింగ్ మోహన్ బాబు కూతురు కదా! ఇలా తెలుగును ముక్కలు ముక్కలుగా చేసి మాట్లాడుతోందేంటీ? అని అనుకునే వారు. ఇన్నేళ్ళలో తెలుగును మాట్లాడే తీరును మంచు లక్ష్మీ మార్చుకోకపోవడమే దానికి కారణం. అయితే.... మంచు




లక్ష్మీ ఈ విషయాన్ని చాలా లైట్ తీసుకుంటుంది. తన తెలుగు యాక్సెంట్ గురించి ఎవరైనా విమర్శించినా... స్పోర్టీవ్ గానే తీసుకుంటుంది. దానికి తాజా ఉదాహరణ అల్లు అర్హాతో జరిగిన సంభాషణే! ఈ చిన్న వీడియోను స్వయంగా మంచు లక్ష్మీ తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేసింది. దానిని చూసిన వాళ్లంతా తెగ ఆనందిస్తున్నారు. అల్లు అర్హా మాటకారి తనాన్ని, లక్ష్మీ జవాబును మళ్ళీ మళ్ళీ వింటూ ఎంజాయ్ చేస్తున్నారు!

## పెద్ద హీరో అరుపులు.. తమన్నా ఏడుపు.. క్షమాపణలు




అతి చిన్న వయసులోనే సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చారు మిల్కీబ్యూటీ తమన్నా . దక్షిణాదిలో అగ్ర హీరోలందరి సరసనచచ ఆమె అవకాశాలందుకున్నారు. నటిగా మంచి గుర్తింపు పొంది టాలీవుడ్‌లో అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఉన్నారు. ప్రస్తుతం సినిమాలతోపాటు వెబ్ సిరీస్‌లతోనూ అలరిస్తున్నారు. తాజాగా బాలీవుడ్‌లో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ తన కెరీర్ బిగినింగ్ డేస్‌ను గుర్తు చేసుకున్నారు. ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. ప్రారంభంలో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయని ఆ విషయాన్నే మేకర్స్‌కు చెప్పగా ఆమె స్థానంలో మరో నటిని తీసుకొచ్చి పెట్టారని తమన్నా చెప్పారు'నేను టీనేజ్‌లోనే ఇండస్ట్రీలోకి వచ్చాను. అప్పట్లో నాకేం తెలియదనుకునేవారు. నా నమ్మకాన్ని దెబ్బ తీయాలని చాలామంది ప్లాన్ చేశారు. ఇలా ఎన్నో సందర్భాల్లో జరిగింది. చాలా అవమానాలు ఎదుర్కొన్నా. పరిశ్రమకు వచ్చిన కొద్దికాలంలోనే సౌత్‌లో ఓ పెద్ద స్టార్‌తో నటించే అవకాశం వచ్చింది. అతనితో కొన్ని సీన్స్ చేస్తున్నప్పుడు అసౌకర్యంగా, కష్టంగా అనిపించింది. ఇబ్బందిగా ఉంది నేను చేయలేనని దర్శకనిర్మాతలకు చెప్పాను.

## గ్లింప్స్ కే సలామ్ అంటే.. మరి పూర్తి పాటకు..




యశ్ రాజ్ ఫిల్మ్ సంస్థ(నుంచి వస్తున్న తాజా చిత్రం 'వార్ 2' హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కీలక పాత్రధారులుగా అయాన్ ముఖర్జీ తెరకెక్కించారు. ఈ చిత్రం గురించి ప్రేక్షకులు ఎంతో ఎగ్జైటింగ్‌గా ఎదురుచూస్తున్నారు. గ్లింప్స్, టీజర్‌లతో సినిమాపై ఆసక్తి పెంచారు నిర్మాత ఆదిత్యా చోప్రా. ఇందులో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ యాక్షన్, డ్యాన్ చూసేందుకు ఆడియన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 14 ఎప్పుడెప్పుడు వస్తుందా? సినీ లవర్స్ ఎగ్జైటింగ్‌గా ఉన్నారు. ఈ చిత్రంలో హృతిక్ తారక్ లకు మంచి డాన్స్ నంబర్ ఉందని చాలాకాలంగా ప్రచారం సాగుతోంది. ఆ పాట కోసం అయితే అభిమానులు మరింతగా ఎదురుచూస్తున్నారు. తారక్, హృతిక్ రోషన్ ఇద్దరూ మంచి డాన్సర్లే. వీరిద్దరూ ఒకే తెరపై స్టెప్పులేస్తే ఎలా ఉంటుందోనని ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఆ సమయం రానే వచ్చింది. ఈ సినిమాలో తారక్, హృతిక్‌కు మధ్య సాగే సాంగ్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'రేయి పగలు ఏదైనా గానీ.. మనముంటే కాదా దీవాలీ.. దునియా మనకి సలామ్ అనాలి' అంటూ సాగే పాటను అభిమానులకు కాస్త రుచి చూపించారు. ప్రీతమ్ సంగీతం అందించారు. తెలుగు వెర్షన్ పాటకు కృష్ణ కాంత్ సంగీతం అందించారు.

## రశ్మికపై ఆ రెండు పాత్రల ప్రభావం




నేషనల్ క్రష్ రష్మిక మందణ్ణ తన కెరీర్ పై 'పుష్ప' లోని శ్రీవల్లి, 'ఛావా'లోని యశో బాయ్ పాత్రల ప్రభావం ఉందని చెప్పింది. ఈ రెండు లైఫ్ ఛేజింగ్ క్యారెక్టర్స్ అని చెబుతూ, వాటి ప్రభావం నటిగా తనపై ఎంతో ఉందని, వాటి పోషణ, వాటికి లభించిన ఆదరణ కారణంగా నటిగా తనపై తనకు నమ్మకం వచ్చిందని తెలిపింది.%'పుష్ప' సినిమాతో నేషనల్ క్రష్‌గా మారిన రశ్మిక మందణ్ణ ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది. ఆమె నటించిన కొన్ని హిందీ సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా... 'పుష్ప, పుష్ప -2' తో పాటు రణబీర్ కపూర్ సరసన చేసిన హిందీ సినిమా 'యానిమల్' ఆమెను బాక్సాఫీస్ పీఠంపై అగ్రస్థానంలో నిలబెట్టింది. అయితే 'యానిమల్' సినిమాలోని పాత్రపై వచ్చిన విమర్శలను రశ్మిక లైట్ తీసుకోమంటోంది. చూడమని చెప్పరని,

## కుటుంబ సభ్యుల అంగీకారంతో 'హనీమూన్ ఇన్ షిల్లాంగ్'

మేఘాలయ 'హనీమూన్ మర్డర్' కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే! త్వరలో ఈ మర్డర్ కేసు సినిమాగా రాబోతుంది. బాలీవుడ్ దర్శకుడు ఎస్‌పీ నింబావత్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. దీని కోసం మృతుడు రాజా రఘువంశీ కుటుంబసభ్యులను కలిసి దర్శకుడు మాట్లాడారు. వారు కూడా అంగీకారం తెలిపారని సమాచారం.




'హనీమూన్ ఇన్ షిల్లాంగ్' పేరుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ మేరకు రాజా రఘువంశీ కుటుంబ సభ్యులు మాట్లాడారు. 'ఈ హత్య కేసుపై సినిమా తీసేందుకు మేం అంగీకరించాము. మా సోదరుడి మృతిని వెండితెర పైకి తీసుకొస్తేనే తప్పు ఎటువైపు ఉందనేది తెలుస్తుందనే ప్రజలకు తెలుస్తుంది' అని మృతుడు రాజా రఘువంశీ సోదరుడు సచిన్ తెలిపారు. దర్శకుడు నింబావత్ మాట్లాడుతూ.. 'భవిష్యత్తులో ఇలాంటి ఘోరాలు జరగకుండా ఆగాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీసేందుకు సిద్ధమయ్యాం.
(

# టుడే స్పోర్ట్స్

## ఆ సమయంలో ఎవరైనా అదే చేస్తారు..

## భారత ఆటగాళ్లు అభినందించారు: క్రిస్ వోక్స్



భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఇద్దరు ఆటగాళ్లు అందరి హృదయాలను గెలుచుకున్నారు గాయాలతోనే బ్యాటింగ్‌కు దిగి తమ జట్టుకు అండగా నిలవడానికి ప్రయత్నించిన టీమిండియా ఆటగాడు రిషభ్ పంత్ ఇంగ్లండ్ బౌలర్ క్రిస్ వోక్స్‌)ను చాలా మంది క్రీడాభిమానులు ప్రశంసించారు. ఓవల్ మైదానంలో జరిగిన చివరి మ్యాచ్‌లో ఒంటి చేత్తోనే బ్యాటింగ్ వచ్చిన క్రిస్ వోక్స్ తాజాగా మాట్లాడాడు. తాను గాయంతోనే బ్యాటింగ్‌కు రావాల్సిన పరిస్థితుల గురించి స్పందించాడు.'గాయంతో నేను బ్యాటింగ్‌కు రావాలనుకోవడం సరైన నిర్ణయమే అని భావిస్తున్నా. ఇంకా, వంద పరుగులు చేయాల్సి వచ్చిన పరిస్థితుల్లో బ్యాటింగ్‌కు వెళ్లాల్సి వచ్చినా నేను బాధపడేవాడిని కాదు. నేనే కాదు.. ఇతర దేశాలకు చెందిన ఆటగాళ్లైనా ఇలాగే చేస్తారని అనుకుంటున్నా. నొప్పితోనే బ్యాటింగ్‌కు రావడంపై గిల్ నన్ను అభినందించాడు. భారత ఆటగాళ్లందరూ నన్ను ప్రశంసించారు. నా ఫొటోకు ఇన్‌స్టాగ్రామ్‌లో రిషభ్ పంత్ సెల్యూట్ ఎమోజీ పెట్టాడు' అని వోక్స్ చెప్పాడు.అలాగే మ్యాచ్ అనంతరం టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో జరిగిన సంభాషణ గురించి కూడా వోక్స్ మాట్లాడాడు. 'చివరి టెస్ట్ మ్యాచ్ ముగిసిన తర్వాత గిల్‌తో మాట్లాడా. నీకు ఇది గొప్ప సిరీస్‌గా మిగిలిపోతుందని ప్రశంసించా. జట్టును ముందుండి నడింపించావని, బ్యాటింగ్‌లో రాణించి మంచి సోపర్ట్ ఇచ్చావని ప్రశంసించా' అని వోక్స్ చెప్పాడు. చివరి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ సమయంలో క్రిస్ వోక్స్ భుజానికి గాయం అయిన సంగతి తెలిసిందే.

## ధ్రువ్ జురెల్ ఉంటే గెలుపు ఖాయమా?

## టీమిండియాకు ధ్రువ్ ఉంటే కలిసొస్తోందా..



టీమిండియా యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. విజయవంతమైన టెస్ట్ ఆటగాడిగా నిలిచాడు. తాజాగా టీమిండియా ఐదు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో యువ భారత జట్టు ఇంగ్లండ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. అంచనాలకు మించి రాణించి సిరీస్‌ను డ్రా చేసుకుంది. ముఖ్యంగా ఉత్కంఠగా జరిగిన ఐదో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు చాలా మందిని ఆకట్టుకుంది.ఆ మ్యాచ్‌లో ఆడిన ధ్రువ్ జురెల్ టీమిండియాకు లక్ ఫ్యాక్టర్‌గా మారాడట. అంతేకాదు ఓ అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ధ్రువ్ జురెల్ టీమిండియా తరఫున ఇప్పటివరకు ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. ఆ ఐదు మ్యాచ్‌ల్లోనూ టీమిండియానే విజయం సాధించడం విశేషం. ధ్రువ్ జురెల్ తన టెస్ట్ కెరీర్‌లో ఇప్పటివరకు ఒక్క ఓటమి కూడా చవిచూడలేదు. వెస్టిండీస్ మాజీ ఆల్ రౌండర్ ఆల్డిన్ బాప్టిస్ట్ తన టెస్ట్ కెరీర్‌లో వరుసగా 10 టెస్ట్ మ్యాచ్‌లు ఆడితే అన్నింటిలో ఆ జట్టు గెలిపొందింది.బౌలింగ్ ఆల్ రౌండర్ అయిన బాప్టిస్ట్ తన కెరీర్‌లో పదే టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. ఆ మ్యాచ్‌లన్నింటిలోనూ వెస్టిండీస్ జట్టే గెలుపొందింది. బాప్టిస్ట్ తర్వాత ఆ రికార్డు జురెల్ పేరిటే ఉండడం గమనార్హం. 2024లో టెస్ట్ క్రికెట్ అరంగేట్రం చేసిన జురెల్ ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో 36.42 సగటుతో 255 పరుగులు చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ కూడా ఉంది. అలాగే వికెట్ కీపర్‌గా 9 క్యాచ్‌లు పట్టి, 2 స్టంపింగ్‌లు చేశాడు.

## సిరాజ్ మియా ఆగయా




%హైదరాబాద్: భారత జట్టు స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఇంగ్లండ్ పర్యటనను విజయవంతంగా ముగించుకొని హైదరాబాద్ విచ్చేశాడు. బుధవారం ఇక్కడకు చేరుకున్న సిరాజ్‌కు విమానాశ్రయంలో పెద్ద సంఖ్యలో అభిమానులు సాదర స్వాగతం పలికారు. అంతకుముందు ఫీల్డింగ్ కోచ్ దిలీపతోపాటు సిరాజ్ లండన్ నుంచి తెల్లవారుజామున ముంబైలో దిగాడు. ఎయిర్‌పోర్టులో పలువురు ఫ్యాన్స్ సిరాజ్‌ను ఆటోగ్రాఫలతోపాటు సెల్ఫీలకోసం అడగడం కనిపించింది. ముంబైలో దిగిన వెంటనే మరో విమానంలో సిరాజ్ హైదరాబాద్ బయలుదేరాడు. ఇంగ్లండ్‌తో జరిగిన అన్ని (5) టెస్టుల్లోనూ ఆడిన సిరాజ్ మొత్తం 23 వికెట్లు తీసి రెండు జట్లలో టాప్ బౌలర్‌గా నిలిచాడు. ముఖ్యంగా చివరి టెస్టులో తొమ్మిది వికెట్ల ప్రదర్శనతో జట్టు చిరస్మరణీయ విజయం అందుకోవడంలో 31 ఏళ్ల హైదరాబాదీ కీలక భూమిక పోషించాడు. మరీ ముఖ్యంగా..విజయానికి ఇంగ్లండ్ ఏడు పరుగుల దూరంలో నిలిచి టీమిండియాను ఆందోళనకు గురి చేసిన తరుణంలో ఓ అద్భుత యార్కర్‌తో అట్కిన్సన్‌ను బౌల్డ్ చేసిన సిరాజ్ ఇంగ్లండ్ ఆశలకు తెరదించాడు. హైదరాబాద్ విమానాశ్రయంలో దిగిన సిరాజ్..సోదరుడు స్వయంగా నడుపుతుండగా కారులో ఇంటికి వెళ్లిపోయాడు. మరోవైపు సిరాజ్‌ను సన్మానించేందుకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఏర్పాట్లు చేస్తోంది. 'సిరాజ్‌తో ఇంకా మాట్లాడలేదు. అయితే అతడు నగరంలో కొద్ది రోజులు ఉంటున్నందున తప్పకుండా సన్మానిస్తాం' అని హెచ్‌సీఏ అధికారి ఒకరు తెలిపారు.ఇంగ్లండ్‌తో ఆఖరి టెస్టును భారత్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన మహ్మద్ సిరాజ్ ర్యాంకింగ్స్‌లో మరింత ముందుకెళ్లాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్.. బౌలర్ల జాబితాలో సిరాజ్ ఏకంగా 12 స్థానాలు ఎగబాకాడు. తద్వారా 15వ ర్యాంక్‌తో మొదటిసారి టాప్-15లో నిలిచాడు. సిరాజ్‌కు కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. గతేడాది జనవరిలో 16వ ర్యాంక్ సాధించడమే సిరాజ్‌కు అత్యుత్తమం. ఇక, ఇంగ్లండ్‌తో సిరీసలో కేవలం మూడు టెస్టులే ఆడిన బుమ్రా నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. మరో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ 25 స్థానాలు ఎగబాకి 59వ ర్యాంక్‌లో నిలిచాడు. బ్యాటర్లలో యశస్వీ జైస్వాల్ మూడు స్థానాలు మెరుగై 5వ ర్యాంక్‌కు చేరాడు. పంత్ ఓ స్థానం చేజారి 8వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్లు రూట్, బ్రూక్ వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.ఓవల్‌లో జరిగిన చివరి టెస్టులో సూపర్ బౌలింగ్‌తో అదరగొట్టిన సిరాజ్‌ను కోహ్లీ సోదరి భావనా కోహ్లీ ?థింగార ప్రశంసల్లో ముంచెత్తింది. 'అభిమానులను అలరించడంలో క్రికెట్ ఎప్పుడూ విఫలం కాదు. మనలో స్ఫూర్తి నింపుతూ, ఆత్మవిశ్వాసం కల్పిస్తూ, నమ్మకం పెంచి, సానుకూల దృక్పథం కలిగించే హీరోలు ఎప్పుడూ ఈ ఆటలో ఉంటారు. అలాంటి వారిలో నీవు ఒకడివి' అని ఇన్‌స్టాలో భావన ఉద్వేగభరిత పోస్ట్ చేసింది. లార్డ్స్‌లో ఉద్విగ్నభరితంగా ఉన్న, ఓవల్ మ్యాచ్‌లో సంబరాలు చేసుకుంటున్న సిరాజ్ ఫొటోలను ఆ పోస్ట్‌కు జత చేసింది.

## మెషిన్ కూడా ఇతడిని చూసి అసూయపడుతుందేమో..

## జంపింగ్‌లో ప్రపంచ రికార్డు..



చైనాకు చెందిన ఓ వ్యక్తి నమ్మశక్యం కాని రికార్డు సాధించాడు. జపాన్‌లో జరిగిన 2025 ప్రపంచ జంప్-రోప్ ఛాంపియన్‌షిప్ లో రోప్ జంపింగ్ )లో అనితర సాధ్యమైన రికార్డును నెలకొల్పాడు. దక్షిణ చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ రాజధాని గ్వాంగ్‌జౌ నగరానికి చెందిన సెన్ జియోలిన్ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన జంప్ రోపర్‌గా నిలిచాడు. అతడు కేవలం 30 సెకెన్ల వ్యవధిలో ఏకంగా 238 జంప్‌లతో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.జియోలిన్ జంపింగ్ ప్రపంచ రికార్డుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియోలోని జియోలిన్ జంపింగ్ స్పీడ్ చూసిన వారందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తాజాగా జియోలిన్ కేవలం 30 సెకెన్ల వ్యవధిలో ఏకంగా 238 జంప్‌లతో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఇంతకు ముందు రికార్డు కూడా జియోలిన్ పేరు మీదే ఉంది.

## ఆసియా బాక్సింగ్

## ఫైనల్స్‌కు నలుగురు



బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిపలో భారత్ నుంచి నలుగురు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. నీరజ్ (75 కిలోలు), ఇషాన్ (90ం కి), మహిళల్లో యాత్రి (57 కి), ప్రియ (60 కి) సెమీఫైనల్స్‌లో తమ ప్రత్యర్థులను ఓడించి తుదిపోరులో నిలిచారు. ఇక, మిగతా భారత బాక్సర్లలో హర్ష్ (60 కి), మయూర్ (90 కి), రాకీ (85 కి), అంకుష్ (64 కి), మహిళల్లో భావన శర్మ (48 కి), పార్థవి గ్రేవాల్ (60 కి), పర్ణంజల్ యాదవ్ (65 కి), శృతి (75 కి) సెమీఫైనల్స్‌లో ఓటమిపాలై కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

## యూఎస్ ఓపెన్ సింగిల్స్ విజేతకు

## రూ 43 కోట్లు

న్యూయార్క్: టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్ స్లామ్ యూఎస్ ఓపెన్ ప్రైజ్‌మనీ భారీగా పెరిగింది. పురుషులు, మహిళల సింగిల్స్ విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని గతంలో కంటే ఏకంగా 39 శాతానికి పెంచారు. నిరుడు సింగిల్స్ చాంపియన్ రూ. 31.57 కోట్లు తీసుకోగా.. ఇకనుంచి విజేతకు రికార్డుస్థాయిలో రూ. 43.86 కోట్లు దక్కనుంది. రన్నరప్‌నకు రూ. 21.93 కోట్లు లభించనుంది. సెమీఫైనలిస్టులు రూ. 11 కోట్లు చొప్పున అందుకోనున్నారు. ఓవరాల్ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 745 కోట్లు. 4 గ్రాండ్‌స్లామ్స్‌లో యూఎస్ ఓపెన్ ప్రైజ్‌మనీనే అధికం. సింగిల్స్ విజేతలకిచ్చే ప్రైజ్‌మనీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రూ. 20 కోట్లు, ఫ్రెంచ్ ఓపెన్‌లో రూ. 25 కోట్లు, వింబుల్డన్‌లో రూ. 35 కోట్లుగా ఉంది. యూఎస్ ఓపెన్ ఈనెల 24న మొదలుకానుంది.



# టుడే బిజినెస్

## మరింత పెరిగిన బంగారం ధర.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..





బంగారం ధర మళ్లీ ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువ అవుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడం బంగారం ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్టు 7న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 02, 340కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 93, 810కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర స్వల్పంగా పెరిగింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 02, 490కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 93, 960కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 02, 340కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 93, 810కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

## వచ్చే ఏడాది ఇండోసోల్ సోలార్ ఐపీఓ



హైదరాబాద్ : స్థానిక శిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఐపీఓకు సిద్ధమవుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఐపీఓ ఉంటుందని శిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ సీఎండీ ఎన్ విశ్వేశ్వర రెడ్డి చెప్పారు. ఒకవేళ ఏ కారణం చేతైనా ఇండోసోల్ సోలార్ ఐపీఓ కుదరకపోతే శిరిడీ సాయి ఎలక్ట్రికల్ ఐపీఓ ఉంటుందన్నారు. సోలార్ ఫొటోవోల్టాయిక్ (పీవీ) మాడ్యూళ్ల తయారీ కోసం ఇండోసోల్ సోలార్ నెల్లూరు జిల్లాలోని కరేడు వద్ద ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంటులో వచ్చే ఏడాది చివరి కల్లా 1,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సోలార్ పీవీల ఉత్పత్తి ప్రారంభమవుతుందని విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. ఈ ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం పీఎల్ఐ పథకం కింద రూ.5,175 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నట్టు చెప్పారు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు కోసం రూ.69,000 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు వెల్లడించారు.

## టీసీఎస్ ఉద్యోగుల వేతనాలు పెంపు




న్యూఢిల్లీ: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వచ్చేనెల 1 నుంచి అమలులోకి వచ్చేలా 80% సిబ్బంది వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంతో ప్రధానంగా జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఈ ఏడాది 12,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు టీసీఎస్ ఈ మధ్యనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో కంపెనీ జీతాలను పెంచడం గమనార్హం.

## ట్రంప్ టారిఫ్స్ అవకాశాలుగా మల్చుకోవచ్చు:ఆనంద్ మహీంద్రా



ఇంటర్నెట్ డెస్క్: భారత్‌పై అదనపు సుంకాలు, జరిమానా విధిస్తూ యూఎస్ ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో భారత ఆర్థిక వ్యవస్థ షాక్ కు గురైంది. అమెరికాకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసే మన దేశ పారిశ్రామిక రంగాలు సంక్షోభ వాతావరణాన్ని చూస్తున్నాయి. అయితే, ఈ పరిస్థితిని మన దేశానికి అనుకూలంగా మలచుకోవచ్చని చెబుతున్నారు మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ పెట్టారు. %అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మొదలు పెట్టిన టారిఫ్‌ల యుద్ధంతో ఫ్రాన్స్, జర్మనీ, కెనడా వంటి దేశాలు సొంత వ్యూహాలకు పదును పెట్టాయి. ఫలితంగా ప్రపంచవృద్ధికి కొత్త ఇంజిన్లు తయారవుతున్నాయి. ఇప్పుడు భారత్ కూడా ఈ సంక్లిష్ట పరిస్థితుల్ని అవకాశంగా మల్చుకోవాలి. 1991లో మన దేశంలో ఏర్పడిన విదేశీ మారక నిల్వల సంక్షోభంతో లిబరలైజేషన్‌కు నాంది పడింది. ఇప్పుడు కూడా ఈ సుంకాల యుద్ధాన్ని తట్టుకునేందుకు రెండు బలమైన అడుగులు వేయాలని ఆనంద్ అన్నారు.దేశంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని వేగంగా మెరుగుపర్చాలని, సంస్కరణలకు మించి పెట్టుబడి ప్రతిపాదనలకు సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థను సృష్టించాలని ఆనంద్ సూచించారు. మన దేశం ప్రపంచ పెట్టుబడులకు తిరుగులేని వేదికగా మారాలని అన్నారు. తయారీ రంగంపై దిగుమతి సుంకాలను క్రమబద్ధీకరించాలని, తద్వారా పోటీతత్వాన్ని పెంచాలని ఆనంద్ మహీంద్రా సూచించారు. వీటితో పాటు ఎంఎస్ఎంఈలకు ద్రవ్యలభ్యత సమకూర్చాలని ఆయన అన్నారు.ఇక, విదేశీ మారక నిల్వలను పెంచుకునేందుకు పర్యాటక రంగాన్ని ఒక అద్భుత శక్తిగా మలచాలని ఆనంద్ అన్నారు. ఈ రంగంతో ఉపాధి కూడా పెరిగే అవకాశం ఉందని.. వీసా ప్రాసెసింగ్, టూరిజం కారిడార్ల వంటి వాటిని మెరుగుపర్చాలని ఆనంద్ చెప్పారు.

## ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్.. స్టాక్ మార్కెట్లకు వరుస నష్టాలు..




భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 సుంకాలను విధించిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు నష్టాలను కొనసాగిస్తున్నాయి. ట్రంప్ బెదిరింపుల కారణంగా అంతర్జాతీయంగా కూడా మిశ్రమ సంకేతాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా నష్టాలతో మొదలయ్యాయి. అయితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడం కాస్త సానుకూలాంశంగా కనిపిస్తోంది. కాగా, ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల బాటలో ఉన్నాయి బుధవారం ముగింపు (80, 543)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 300 పాయింట్ల నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాస్త కోలుకుంది. పలు రంగాల్లో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపుతుండడంతో నష్టాల్లోనే కదలాడుతోంది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 279 పాయింట్ల నష్టంతో 80, 264 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 78 పాయింట్ల నష్టంతో 24, 495 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో ఫోర్టిస్ హెల్త్, లూపిన్, పిరామిల్ ఫార్మా, గ్రాన్యుయల్స్ ఇండియా, కోఫోర్జ్ లిమిటెడ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. భెల్, జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్, కంటైనర్ కార్పొరేషన్, భారత్ ఫోర్జ్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 111 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 184 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 87.71గా ఉంది.

## వడ్డీ కోతకు ట్రంపే అడ్డు




ముంబై: పండగ సీజన్‌లో వడ్డీరేట్లు మరింత తగ్గుతాయని ఎదురుచూస్తున్న రుణగ్రహీతల ఆశలపై ట్రంప్ సుంకాలు నీళ్లు చల్లాయి. అమెరికా అధ్యక్షుడి అస్థిర వాణిజ్య విధానాలు, భారత్‌పై రెట్టింపు సుంకాల వడ్డనతో పొంచి ఉన్న ముప్పు దృష్ట్యా ఈ సారి కీలక రెపోరేటును యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించింది. అలాగే, వడ్డీరేట్లపై తటస్థ దృక్పథాన్ని కూడా యధాతథంగా కొనసాగిస్తున్నట్లు ఎంపీసీ తెలిపింది. వర్షపాతం ఆశాజనకంగా ఉండడంతో పాటు పండగ సీజన్ కొనుగోళ్లు ఆర్థిక వృద్ధికి ఊతమివ్వవనున్నప్పటికీ, అంతర్జాతీయ వాణిజ్య సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్‌బీఐ రెపోరేటును 1% తగ్గించింది. ఈ ప్రయోజనం ఆర్థిక వ్యవస్థకు బదిలీ అయ్యే ప్రక్రియ ఇంకా కొనసాగుతోందన్నారు. టారిఫ్‌ల అనిశ్చితి తొలిగితే, వచ్చే సమీక్షలో రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటును గతంలో అంచనా వేసిన 6.5 శాతంగా కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. అంతర్జాతీయ సవాళ్లు, అనిశ్చితులు పెరుగుతున్నప్పటికీ భారత్ స్థిర ధరలతో నిలకడగా వృద్ధి చెందుతోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ సారి సాధారణ స్థాయి కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు, ధరలు తగ్గుముఖం పట్టడం, ఉత్పత్తి సామర్థ్య వినియోగం పెరగడం, సానుకూల ఆర్థిక పరిస్థితులు దేశీయ ఆర్థిక కార్యకలాపాలకు మద్దతివ్వనున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. దేశీయ సేవల రంగం చురుకుగా వృద్ధి చెందుతున్నదని, ముమ్మందు నెలల్లో నిర్మాణం, వాణిజ్యం పుంజుకోనుందని ఆర్‌బీఐ ఈ సందర్భంగా ప్రస్తావించింది.

## రూ 3 లక్షల 5 కోట్లు హాంఫట్



ముంబై: ఆర్‌బీఐ రెపోరేటును యథాతథంగా కొనసాగించిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 166.26 పాయింట్ల నష్టంతో 80,543.99 వద్ద ముగియగా నిఫ్టీ 75.35 పాయింట్ల నష్టంతో 24,574.20 వద్ద ముగిసింది. దీంతో బీఎసఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.3.50 లక్షల కోట్లు దిగజారి రూ.445.19 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 18 షేర్లు నష్టాలతో ముగిశాయి. ఒక్క బ్యాంకెక్స్ తప్ప మిగతా అన్ని సూచీలు నష్టాలతో ముగిశాయి. ఆర్‌బీఐ నిర్ణయం ప్రభావంతో వడ్డీరేట్లపై ఎక్కువగా ఆధారపడిన ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. కొన్ని కౌంటర్లయితే ఐదు శాతం వరకు నష్ట పోయాయి. సుంకాల భయం వెంటాడుతున్నా నిఫ్టీకి 24,500 వద్ద గట్టి మద్దతు లభించే అవకాశం ఉందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థ రీసెర్చి హెడ్ వినోద్ నాయర్ అంచనా

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006